
**తాగునీటికి తప్పని తిప్పలు** 2





**ఇసుక ట్రాక్టర్ల పట్టివేత** 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ఆర్మూర్ సిద్దుల గుట్ట గిరి ప్రదక్షిణ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని సిద్దుల గుట్ట చుట్టూ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హరినామ సంకీర్తనాలతో గిరిప్రదక్షిణ చేశారు. కార్తీకమాసంలో సిద్దుల గుట్ట చుట్టూ ప్రదక్షిణ చేయడం ఎంతో పుణ్యమని ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఇస్కాన్ అధ్యక్షుడు ఆది పురుష ప్రభుజీ, నిజామాబాద్ కంఠేశ్వర్ ఇస్కాన్ అధ్యక్షుడు రామానంద రాయ గౌరదాస్ ప్రభుజీ, భక్తులు పాల్గొన్నారు.


16-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2










# వింటర్.. వేసేద్దాం స్వెట్టర్..

చలిపులి జనాన్ని వణికిస్తోంది. జిల్లాలో వారం పది రోజులుగా రాత్రివేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలితీవ్రత పెరగడంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఉంది. దీంతో ఉన్ని దుస్తులకు (స్వెట్టర్లు, జర్కిన్లు) గిరాకీ బాగా పెరిగింది. ముఖ్యంగా చలి వాతావరణం రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలు వెచ్చదనం కోసం ఈ దుస్తులపై దృష్టి సారిస్తున్నారు. నగరంలోని దేవిరోడ్‌లో నేపాల్‌నుంచి వచ్చిన వ్యాపారులు ఉన్ని దుస్తులను విక్రయిస్తున్నారు. ఈ దుస్తులు నాణ్యతతో ఉండడంతో నగరవాసులు ఎక్కువగా వీటిని కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## నగరంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్





**అక్షరటుడే, ఇందూరు:** బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ డిమాండ్ చేశారు. అష్టాంగ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల ఉద్యమాన్ని నిలపడం ఎవరితరం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తొమ్మిది శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు అమలుపరిచిన కేంద్ర ప్రభుత్వం 56 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా కిషన్, నగర అధ్యక్షుడు దేవేందర్, రవీందర్, శంకర్, అజయ్, చంద్రకాంత్, శ్రీలత, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## పోలీసులకు అర్ధరాత్రి టీ, కాఫీ అందించిన ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది కష్టాన్ని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత 2 గంటల ప్రాంతంలో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి వాటర్ బాటిళ్లతో సహా ఎస్పీ రాజేష్ చంద్ర తన ఇంట్లో టీ, కాఫీ తయారు చేయించి అందజేశారు. సిరిసిల్ల రోడ్, ఎల్లారెడ్డి రోడ్, రామారెడ్డి రోడ్డులో ఎస్పీ రాజేష్ చంద్ర పోలీసుల విధులను తనిఖీ చేశారు. ఈ సమయంలో గడ్డకట్టే చలిలో సైతం విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కష్టాన్ని స్వయంగా చూసి చలించిపోయారు. వెంటనే తన ఇంట్లో టీ, కాఫీ తయారు చేయించి సిబ్బందికి స్వయంగా అందజేశారు. దాంతో తమ కష్టాన్ని గుర్తించడమే కాకుండా టీ, కాఫీ, వాటర్ బాటిళ్లు ఎస్పీ అందజేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అక్రమార్కుల గొడ్డలి వేటుకు పచ్చని చెట్లు కనుమరుగు అవుతున్నాయి. జిల్లాలో కొందరు యథేచ్ఛగా అడవులను నరికి వేస్తున్నారు. ఫారెస్ట్ భూములను చదును చేసి సాగు భూములుగా మారుస్తున్నారు. అధికారులు కేసులు నమోదు చేస్తున్నా.. భయపడకుండా అడవులను ఆక్రమిస్తున్నారు. కొద్ది రోజులు సాగు చేస్తే ప్రభుత్వాలు పట్టాలిస్తాయన్న నమ్మకంతో విచ్చలవిడిగా అడవులను నరికి వేస్తూ సాగు భూములుగా మార్చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు పెద్ద ఎత్తున పోడు పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి అడువల నరికివేత ఎక్కువైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. – అక్షరటుడే, ఇందల్వాయి

# పచ్చని చెట్లు.. గొడ్డలి వేటు..



- యథేచ్ఛగా అడవుల నరికివేత
- సాగు భూములుగా మారుస్తున్న పలువురు
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు
- ప్రభుత్వం పట్టాలిస్తుందనే ధీమా

జిల్లాలో ఇందల్వాయి, సిరికొండ, ధర్పల్లి మండలాల్లో అడవులు ఎక్కువగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కొందరు అడవులను ఆక్రమిస్తున్నారు. ఇందల్వాయి మండలంలోని గౌరారం, నల్లవెల్లి, సిర్నాపల్లి, గన్నారం, చంద్రాయన్‌పల్లి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో గ్రామాల్లో ఉండే చిన్న చిన్న నాయకులు అటవీ భూములను సాగు భూములుగా మార్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిరికొండ మండలంలోని జంగిడలోడి తండా, తూంపల్లి సెక్షన్‌లోని దొంగ చెరువు ప్రాంతం, గుడి లింగాపూర్, పంది మడుగు ధూప్య తండాలలో కొందరు అక్రమార్కులు రాత్రికి రాత్రే అటవీని మైదానాలుగా మార్చేశారు. వారిపై అధికారులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

### రోడ్లకు అనుమతి నిరాకరణ

ప్రజల సౌకర్యార్థం అటవీ భూముల్లో నుంచి రోడ్లు వేయడానికి ఆ శాఖ అధికారులు అడ్డు చెబుతున్నారు. అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో జిల్లాలో చాలా ప్రాంతాల్లో డబుల్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. గతంలో సిర్నాపల్లి నుంచి రామ్ సాగర్ తండాకు రోడ్డు మంజూరు అయింది. అయితే అటవీ ప్రాంతంలో పర్మిషన్ లేకపోవడంతో రోడ్డు పనులు పూర్తికాలేదు. కొండాపూర్ నుంచి రెడ్డిపేట్ బడి తండా వరకు డబులు రోడ్డు పనులకు సైతం అటవీశాఖ అనుమతి ఇవ్వలేదు. అయితే రోడ్ల నిర్మాణానికి కొర్రీలు పెడుతున్న అధికారులు.. వందల ఎకరాలు కబ్జాకు గురవుతుంటే ఏం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పోడు పట్టాలు వస్తాయని..

గతంలో ప్రభుత్వాలు అటవీ భూమిలో సాగు చేసుకుంటున్న వారికి పోడు పట్టాలు ఇచ్చాయి. దీంతో కొందరు ప్రస్తుతం అడవులను ఆక్రమిస్తున్నారు. కొన్నేళ్లు సాగు చేస్తే ప్రభుత్వం పోడు పట్టాలు ఇస్తుందని వారు భావిస్తున్నారు. అయితే పేదలు కాకుండా.. పలుకుబడి ఉన్న వారు, ఆయా గ్రామాల్లోని నాయకులు అడవులను కబ్జా చేస్తున్నారు. మరోవైపు పలువురు అధికారులు సైతం అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మాముళ్లు తీసుకొని బీట్ ఆఫీసర్లు చెట్ల నరికివేత, అటవీ భూముల ఆక్రమణ, అడవిలో నుంచి ఇసుక ఆక్రమణ రవాణా గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న అడవుల నరికివేతను ఉన్నతాధికారులు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### 10 మంది పై కేసు నమోదు

ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలోని గన్నారం బీట్‌లో మేగ్యా నాయక్ తండాకు చెందిన కొందరు వ్యక్తులు ఇటీవల అటవీ శాఖ అధికారులు నాటిన చెట్లను నరికివేసి చదును చేశారు. దీంతో ఇందల్వాయి ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్ ప్లాంటేషన్‌ను ధ్వంసం చేసిన పది మంది వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి ప్లాంటేషన్ పనులు చేపడితే వాటిని ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని ఆయన హెచ్చరించారు. అటవీ సంపదను కొల్లగొట్టే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ప్రభుత్వం



**అక్షరటుడే, భీమ్‌గల్:** పేద, మధ్యతరగతి కుటుంబాల చిరకాల కోరిక సొంతింటి కల ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో నెరవేరిందని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునిల్ కుమార్ అన్నారు. వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన రాజు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఇల్లు లేని పేదవారందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వ అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో 'లాస్ట్ ప్రాపర్టీ క్లెయిమ్'





**అక్షరటుడే, ఇందూరు:** ఆర్టీసీ నిజామాబాద్ డిపో-1 పరిధిలో ప్రయాణికులు మరిచిపోయిన, కోల్పోయిన వస్తువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు డిపో మేనేజర్ ఆనంద్ తెలిపారు. ఈనెల 18న ఉదయం 10 నుంచి 3 గంటల వరకు నిజామాబాద్ బస్టాండ్‌లో లాస్ట్ ప్రాపర్టీ క్లెయిమ్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వస్తువులపై 30శాతం రాయితీ కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## చోరీ బైకు అమ్మకం ఘటన.. కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

**అక్షరటుడే, కామారెడ్డి:** చోరీ కేసులో పట్టుబడ్డ బైక్‌ను అమ్మిన కానిస్టేబుల్‌పై ఎట్టకేలకు సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు ఎస్పీ రాజేశ్ చంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ విశ్వనాథంను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు అధికారిక ప్రకటన విడుదల చేశారు. తదుపరి అంతర్గత విచారణ జరుగుతుందని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నంబర్ 29/2024లో బైకు దొంగతనాలకు సంబంధించిన కేసు నమోదై ఉంది. కాగా.. వివిధ ప్రాంతాల నుంచి దొంగతనం చేసిన 29 టూ వీలర్లను అప్పటి సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రికవరీ చేశారు. ఇందులో కొన్ని టెంపరరీ రిజిస్ట్రేషన్లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిని సేఫ్ కస్టడీ నిమిత్తం కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. కాగా.. గతంలో పనిచేసిన కానిస్టేబుల్ విశ్వనాథం టూ వీలర్‌ను అమ్ముకున్నట్లు గుర్తించారు. సదరు బైకు మైలార్ దేవునిపల్లికి చెందిన వ్యక్తిది కాగా.. ఆ వాహనం చోరీకి గురైంది. అనంతరం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రికవరీ అయ్యింది. అయితే సదరు వాహన యజమానికి ఇప్పటి వరకు బండి ఇవ్వలేదు. మరోవైపు పోలీస్ సేఫ్ కస్టడీలో ఉంచాల్సి ఉండగా.. కానిస్టేబుల్ విశ్వనాథం అమ్ముకున్నారు. ఈ విషయాన్ని 'అక్షరటుడే' వెలుగులోకి తీసుకురాగా.. వెంటనే స్పందించి ఎస్పీ రాజేశ్ చంద్ర.. సదరు కానిస్టేబుల్ విశ్వనాథంను సస్పెండ్ చేశారు.

**అక్షర టుడే కథనానికి స్పందన**

### అప్పటి సీఐపై చర్యలుంటాయా..

ఈ మొత్తం వ్యవహారంలో కానిస్టేబుల్ విశ్వనాథం కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అప్పటి సీఐ చంద్రశేఖర్ రెడ్డి హయాంలో సదరు కానిస్టేబుల్ చేతుల మీదుగానే అన్ని రకాల లావాదేవీలు, అక్రమ వసూళ్లు, సెటిల్‌మెంట్లు జరిగాయి. పలుమార్లు ఏసీబీ ట్రాప్ నుంచి తప్పించుకున్నట్లు ప్రచారంలో ఉంది. గతంలో అనేక ఫిర్యాదులు వెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు లేకుండా అప్పటి ఉన్నాధికారులు అండదండలు ఉండడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రాథమికంగా కానిస్టేబుల్ విశ్వనాథంపై వేటు వేసిన అధికారులు, అప్పటి ఎస్‌హెచ్‌వోగా ఉన్న చంద్రశేఖర్ రెడ్డి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. సీపీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇందల్వాయి వద్ద శనివారం సాయంత్రం అంతర్రాష్ట్ర దోపిడీ ముఠాను పట్టుకొని 40 కిలోల ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్, రూ.5.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ముఠా గత ఏడాది కాలంగా జిల్లాలోని ఇందల్వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, మెండోరా, ముప్కాల్, మోర్తాడ్, మోపాల్, బోధన్ టౌన్, బోధన్ రూరల్, నవీపేట్, వర్ని, మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ కాయిల్స్ దొంగిలించిందని వివరించారు. వీరు జిల్లాలో మొత్తం 101 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారన్నారు. కాగా.. మొత్తం 44 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ టీంలను నియమించి శనివారం నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ముఠాలోని ఐదుగురు సభ్యులతో పాటు వీరి వద్ద కాపర్ కాయిల్స్ కొనుగోలు చేసిన ముగ్గురిని కూడా అరెస్ట్ చేశామని వెల్లడించారు. నిందితులను కోర్టు ముందు హాజరు పరుస్తామని ఆయన తెలిపారు. ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కేసును ఛేదించడంలో ముఖ్య పాత్ర పోషించిన డిచ్‌పల్లి సీఐ వినోద్, ఎస్సైలు సందీప్, షరీఫ్, మహేష్, సిబ్బంది, కిరణ్ గౌడ్, ప్రశాంత్, సందీప్, కిషోర్ కుమార్, సుజిత్, నవీన్, సర్దార్‌లను సీపీ సాయి చైతన్య అభినందించారు.

## మాలల రణభేరి పోస్టర్ల ఆవిష్కరణ



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాల మహానాడు మండల అధ్యక్షుడు అగ్గు క్రాంతి ఆధ్వర్యంలో మాలల రణభేరి మహాసభ పోస్టర్లు, కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అగ్గు క్రాంతి మాట్లాడుతూ.. ఈనెల 23న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్ లో జరగనున్న మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాల సమాజ హక్కులు, అభివృద్ధి కోసం ప్రతి కుటుంబం సభకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ ఉదయ్, అర్ష ప్రదీప్, గంగాధర్, సజన్, శ్రీకర్, ఉమ్మెడ రాకేష్, తలారి మల్లేష్, రన్‌వీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి బయలుదేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**అక్షరటుడే, కోటగిరి:** మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సోంపుర్ పోచిరాం మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు సీజేఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేయడాన్ని హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. చలో ఢిల్లీలో భాగంగా జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపడానికి భారీఎత్తున బయలుదేరి వెళ్తున్నామని చెప్పారు. నవంబర్ 17న నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమం పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండలాల, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ పట్టణంలో శ్రమదానం



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ ఆవరణలో ఆదివారం మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. సంస్థ ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో చేస్తున్న మా ఈ స్వచ్ఛ కార్యక్రమం విజయవంతంగా 29 వారాలు పూర్తి చేసుకుందన్నారు. తపస్వీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు వసతి కల్పించి చదివించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి సంస్థకు ప్రజలు తమకు తోచిన విధంగా సహాయం చేయాలన్నారు. అనంతరం తమ వంతుగా రైస్ బ్యాగును అందజేశారు. కార్యక్రమంలో తపస్వీ స్వచ్ఛంద సంస్థ జనరల్ సెక్రెటరీ దిలీప్, డైరెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఇన్‌ఛార్జి కవిత, వైస్ ప్రిన్సిపాల్ అనూష, సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్, సుమన్, శ్యాంసుందర్, ఒత్తూరు రాజన్న, కుతాడి ఎల్లయ్య, జంగిడి భోజన్న, నూకల ఆధత్య పాల్గొన్నారు.

## ఆరోగ్య నియమాలతో అదుపులో మధుమేహం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆరోగ్య నియమాలతో మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చని వెంబో క్లినిక్ వైద్యుడు బీఎస్ రెడ్డి సూచించారు. మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామంలోని జీపీ వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంబో క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో భాగంగా ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వైద్యుడు బీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మధుమేహం ఉన్నవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆహార నియమాలు పాటిస్తే షుగర్ కంట్రోల్‌లో ఉంటుందని చెప్పారు. ప్రతిరోజు ఉదయం గంటసేపు వాకింగ్ తో పాటు చిన్నపాటి వ్యాయామం చేయాలన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకుంటూ షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంబో క్లినిక్ నిర్వాహకులు బొట్టు వెంకటేశం, గుండారం భూమేష్, కులాస్‌పూర్ గ్రామ కమిటీ సభ్యులు పి లక్ష్మణ్, పృథ్వీరాజ్, గుండ్ల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

చలికాలంలోనూ నీటికోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. గాంధారి మండల కేంద్రంలో ఈ పరిస్థితి నెలకొంది. ఆయా కాలనీల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ల ద్వారా నీళ్లు రాకపోయేసరికి ప్రజలు గుక్కెడు నీటికోసం సుదూర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. మండలంలోని ఎస్సీ వాడలో ఇంతకుముందు వాగును ఆనుకుని బోరుబావి ఉండేది. దీనిద్వారా ఆయా కాలనీలకు నీటి సరఫరా జరుగుతుండేది. కానీ ఇటీవల వరదల కారణంగా బోరు పాడైంది. అప్పటి నుంచి కాలనీలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

– అక్షరటుడే, గాంధారి



# తాగునీటికి తిప్పలు..

- గాంధారి మండల కేంద్రంలో నీటిగోస
- మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నా లేనట్టే..
- ఎస్సీవాడలో అవస్థలు

మిషన్ భగీరథ పైపుపైలన్ ప్రతి ఇంటికి ఉంది. కానీ చుక్క నీరు రాకపోవడంతో గాంధారి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. బిందెడు నీటికోసం అష్టకష్టాలు పడుతున్నామని ఎస్సీ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు బోరు చెడిపోయి.. మరోవైపు భగీరథ నీళ్లు రాకపోవడంతో తాగునీటి కోసం నిత్యం పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వారు వాపోతున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ సెక్రెటరీకి సమస్యను వివరించగా వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### పేరుకే మిషన్ భగీరథ..

స్థానిక ఎస్సీవాడలో సుమారు 500 కుటుంబాలుంటాయి. అందులో చాలావరకు కుటుంబాలు వాటర్ ట్యాంక్ కోసమే ఎదురు చూస్తున్నాయి. కాలనీకి ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎందుకూ పనికిరావడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ సంపు నుండి ట్యాంకుకు అనుసంధానం చేసిన పైపులలో ఒక్కరోజు కూడా నీళ్లు సరఫరా కాలేదని వారు పేర్కొంటున్నారు. ఏడాదిగా మిషన్ భగీరథ పైప్‌లైన్ వృథాగా ఉందని వారు ఆరోపిస్తున్నారు. అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఫలితం మాత్రం శూన్యమని వారు పేర్కొంటున్నారు.

### తాగునీటి సమస్య లేదు..

ఎస్సీ వాడలో తాగునీటి సమస్య లేదు. ఎప్పటికప్పుడు తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నాం. నీటిసమస్య రాకుండా ట్యాంకర్ ద్వారానైనా నీటిని అందిస్తున్నాం. కానీ పూర్తిస్థాయిలో నీటి అందించలేకపోతున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా కాలనీలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తాం.

– దామోదర్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈఈ



## ఎలుగుబంటి వచ్చే.. కోతుల పరారయ్యే..

కమ్మర్‌పల్లి మండలంలోని హాసాకొత్తూరు గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా మారింది. గుంపులుగా కోతులు రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు కోతుల భయంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి వెనుకాడుతున్నారు. దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు వీడీసీ సభ్యులు వినూత్న ప్రయత్నం చేశారు. ఓ మనిషికి ఎలుగుబంటి దుస్తులు ధరింపజేశారు. ఎలుగుబంటి వేషధారణలో సదరు వ్యక్తి ఊరంతా తిరగడంతో కోతులు పరారవుతున్నాయి.

– అక్షరటుడే, కమ్మర్‌పల్లి

## జీవన సంకల్పంతో ముందుకు సాగాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతి ఒక్కరూ జీవన సంకల్పంతో ముందుకు సాగాలని ప్రముఖ కవి మేడిచర్ల ప్రభాకర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ పక్కన ఉన్న గీతా భవన్‌లో రచయిత తొగర్ల సురేష్ రచించిన సంకల్పం యాత్ర చరిత్ర గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడిచర్ల ప్రభాకర్ మాట్లాడుతూ.. లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రతిఒక్కరూ ముందుకు సాగినప్పుడే జీవన సాఫల్యం కలుగుతుందన్నారు. అనంతరం కవి తిరుమల శ్రీనివాస్ ఆర్య మాట్లాడుతూ మనో సంకల్పం ఉంటే ఏ కార్యమైనా విజయతీరాలకు చేరుతుందని పేర్కొన్నారు. మరోకవి కంకణాల రాజేశ్వర్ మాట్లాడుతూ 1930లో కాశీ యాత్ర చరిత్ర గ్రంథం రాసిన ఏనుగుల వీరాస్వామి కోవకు చెందినదే ఈ తొగర్ల సురేష్ రాసిన సంకల్పం యాత్ర చరిత్ర గ్రంథం అని వివరించారు. అనంతరం కవులు, సాహితీవేత్తలు గ్రంథకర్త తొగర్ల సురేష్‌ను సత్కరించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు వేదాంతం రంగనాథ్ తన వ్యాఖ్యానంతో మంత్రముగ్ధుల్ని చేశారు. కార్యక్రమంలో సహాయాత్రికుడు తిరునగరి నవనీత్, దంతాల రాజేశ్వర్, ఆడెపు లింబాద్రి, చాకు లింగం, గీతా దయానందం, డాక్టర్ పోత్నూర్ లక్ష్మణ్, వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి, కండక్టర్ నర్సయ్య, జనగామ చంద్రశేఖర్ శర్మ, డాక్టర్ గురువారెడ్డి పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. స్థానికంగా ఉన్న అయ్యప్ప గుడి వద్ద ఎమ్మెల్యే మదన్ మోహన్ తన సొంత నిధులతో రోడ్డు నిర్మాణం చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములు, ఇతర భక్తులు గుడికి వచ్చే సందర్భాల్లో ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, స్థానిక నాయకులు, కార్యకర్తలు అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**అక్షరటుడే, లింగంపేట :** లింగంపేట పెద్ద వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్మళ్ల నుంచి అనుమతి లేకుండా లింగంపేటకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, లింగంపేట పెద్దవాగు నుంచి అనుమతి ఇసుక తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.





## ఆర్వోబీ వద్ద దుమ్ముతో ఇక్కట్లు..

మామిడిపల్లి ఆర్వోబీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్లుగా సాగుతున్న ఆర్వోబీ పనుల్లో భాగంగా వంతెన నిర్మాణం ఇటీవలే పూర్తయింది. కానీ కంకర రోడ్డుతో అవస్థలు తప్పట్లేదు. రోడ్డుపై విపరీతంగా దుమ్ము లేవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. – అక్షరటుడే, ఆర్మూర్

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, కామారెడ్డి:** సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు రామారెడ్డి మాజీ జెడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని ఇద్దరు బాధితులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయించినట్లు తెలిపారు. బాధితులు ఆస్పత్రి బిల్లులతో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం మంజూరు అవుతుందని చెప్పారు.

## విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని బీసీ వసతి గృహ విద్యార్థులకు భీమ్‌గల్ వేముగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పడాల పురందర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి మెరుగైన సౌకర్యాలు కల్పించడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. చలికాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో 30మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై మాత్రమే తమ దృష్టి కేంద్రీకరించాలని ఆయన సూచించారు. లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాలలో చురుకుగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గజ్జెల చైతన్య, కోశాధికారి ఎడ్ల శేఖర్, హన్మాండ్లు, ప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్ రామావత్, సహాయ కోఆర్డినేటర్ భూక్యా లింబాద్రి, పురాస్తు లింబాద్రి, ఇమ్మానుయేల్ ర్యాడ శ్రీనివాస్, హన్మంతు, క్లబ్ సభ్యులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుడి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** తాడ్వాయి మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు సతీష్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ మండలంలో సతీష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. స్వయంగా పాడె మోసి భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం సతీష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సతీష్ చేసిన కృషి మరువలేనిదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.